## క్లుప్తంగా

### మాజీ ఎమ్మెల్యేను కలసిన డీఎస్పీ


మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి

ఉరవకొండ: నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డితో గుంతకల్లు డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన శివభాస్కర్ రెడ్డి భేటీ అయ్యారు. శుక్రవారం అనంతపురంలోని మాజీ ఎమ్మెల్యే స్వగృహంలో డీఎస్పీ మర్యాద పూర్వకంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గుంతకల్లు డివిజన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే సూచించారు.

### 'ఏపీజీబీలో అత్యధిక వడ్డీ పథకాలు'

రాయదుర్గంటౌన్: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో అత్యధిక వడ్డీని అందజేసే ఫిక్సడ్ డిపాజిట్లను ఖాతాదారులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాయదుర్గం బ్రాంచి మేనేజర్ బొజన్న సూచించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో బ్యాంకులో అమలు చేస్తున్న డిపాజిట్ స్కీమ్‌లపై అందజేసే వడ్డీ రేట్లను వెల్లడించారు. అన్ని బ్యాంకుల కంటే అత్యధిక వడ్డీ అందజేస్తున్న ఏకైక ప్రభుత్వ రంగ బ్యాంకు ఏపీజీబీ అన్నారు. డిపాజిట్ స్కీమ్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

### గుంతకల్లుకు వెళ్లి పింఛన్ అందజేత


ఇజ్‌తిమాలో ఉన్న పింఛన్‌దారులకు పింఛన్ అందిస్తున్న వలంటీరు బాషా

ఉరవకొండ: వజ్రకరూరు మండలం జరుట్ల రాంపురం గ్రామానికి చెందిన పింఛన్‌దారులు షేక్‌రాజాసాబ్, షేక్‌ఖాసీం మూడు రోజుల క్రితం గుంతకల్లులో నిర్వహించే ఇజ్‌తిమా (ముస్లిం సోదరుల సామూహిక ప్రార్థనలు)కు వెళ్లారు వలంటీరు ఎస్‌ఎం బాషా శుక్రవారం గుంతకల్లులో సామూహిక ప్రార్థనలు నిర్వహిస్తున్న చోటకే వెళ్లి వారికి పింఛన్ అందించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న సేవ, సంక్షేమ పథకాలను మెచ్చుకుంటూ థ్యాంక్యూ సీఎం సాబ్ అంటూ వారు కొనియాడారు.

### క్రమశిక్షణ అలవర్చుకోండి

కూడేరు: విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకోవాలని ఎంఈఓ చంద్రశేఖర్ సూచించారు. మండలంలోని గొటుకూరు ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరుకు సంబంధించిన రిజిస్టర్లు, మధ్యాహ్న భోజన నాణ్యతను ఆయన పరిశీలించారు. అనంతరం పిల్లలతో సమావేశమై మాట్లాడారు. పిల్లలకు సులభ పద్ధతిలో విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం వైద్యాధికారులతో కలిసి కుష్టు వ్యాధిపై పిల్లలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ చంద్రకళ, ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

### బీపీ పెరిగితే ప్రసవం కష్టతరం

కూడేరు: బీపీ పెరిగితే ప్రసవం కష్టతరమవుతుందని మండల వైద్యాధికారి లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం కూడేరులోని పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య శిబిరం నిర్వహించారు. ఆరోగ్య సూత్రాలు పాటించడంతోపాటు, పౌష్టికాహారం తీసుకుంటే సుఖ ప్రసవం పొందవచ్చని ఆయన సూచించారు. ప్రభుత్వాస్పత్రిలోనే ప్రసవం పొందాలన్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ రవీంద్ర, ల్యాబ్ టెక్నీషియన్ వేణుగోపాల్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

### 'వైఎస్సార్ పశు బీమా' సద్వినియోగం చేసుకోవాలి


విడపనకల్లులో అవగాహన కల్పిస్తున్న పశుసంవర్ధక శాఖ డీడీ డాక్టర్ వెంకటేష్

ఉరవకొండ: వైఎస్సార్ పశు బీమా పథకం ద్వారా గొర్రెలు, మేకలు, పాడి పశువులకు బీమా చేయించుకోవాలని ఉరవకొండ పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వెంకటేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఉరవకొండ, విడపనకల్లు మండలాల్లో వైఎస్సార్ పశుబీమా పథకంపై రైతులకు అవగాహన కల్పించారు. డీడీ మాట్లాడుతూ పశుపోషకులు 20 శాతం ప్రీమియం చెల్లిస్తే, ప్రభుత్వం 80 శాతం కడుతుందన్నారు. రూ.30 వేలు విలువ చేసే పశువుకు మూడేళ్లకు గాను రూ.384, జీఎస్టీ 3.53 శాతం చెల్లిస్తే బీమా పొందవచ్చన్నారు. నాటు పశువుకు రూ.15 వేలు, గొర్రెలు, మేకలకు రూ.6 వేల బీమా వర్తిస్తుందన్నారు. పాడి రైతులను ఆదుకోవడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు.

# ప్రజారోగ్యానికి సీఎం జగన్ పెద్దపీట


డంపింగ్ యార్డు కోసం స్థల సేకరణ చేస్తున్న సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి, మున్సిపల్ చైర్మన్ శిల్ప, అధికారులు,


నాయీబ్రహ్మణులతో కలసి మాట్లాడుతున్న మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గం: ప్రజారోగ్యానికి సీఎం వైఎస్ జగన్ పెద్దపీటవేశారని, దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలో మాత్రమే వైద్య, ఆరోగ్య రంగంలో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని ఏపీఐఐసీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని శాంతినగర్‌కు సమీపాన ఉండే డంపింగ్ యార్డును మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైస్ చైర్మన్ వలీబాషా, పట్టణ కన్వీనర్ అరవ శివప్ప, నాయకుడు పొరాళ్ల శివా, కౌన్సిలర్లు, అధికారులతో కలసి ఆయన పరిశీలించారు. అనంతరం మెట్టు మాట్లాడారు. పరిసరాలు, వ్యక్తిగత శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమన్నారు. సమిష్టిగా కదిలితే రాష్ట్రంలోనే రాయదుర్గాన్ని స్వచ్ఛతలో ఆదర్శంగా నిలుపుకోవచ్చన్నారు. అనంతరం మల్లాపురం లేఅవుట్ దాటుకుని శంభులింగ కొండవద్ద డంపింగ్ యార్డు కోసం స్థల సేకరణ చేపట్టారు.

**సిద్ధం సభకు భారీగా తరలుదాం**

ఈ నెలలో అనంతపురంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన వైఎస్సార్‌సీపీ ఎన్నికల శంఖారావం సభను విజయవంతం చేసేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ శ్రేణులకు మెట్టు దిశానిర్దేశం చేశారు. పట్టణంలోని అన్ని వార్డుల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి మాధవరెడ్డి, కౌన్సిలర్లు కొంతెం దేవరాజు, తట్టే మంజు, పొరాళ్ల గోవిందరాజులు, గౌని లావణ్య, శారద, శ్రీనివాసరెడ్డి, ఐనాపురం మంజు, వార్డు ఇన్‌చార్జులు గౌని శ్రీరామిరెడ్డి, నిజామ్, దివాకర్, గోల్డ్ ఇస్మాయిల్, పాటిల్ వెంకటరెడ్డి, రాధాకృష్ణ, స్టోర్ బుజ్జి, వీఆర్వో ఉమేష్ పాల్గొన్నారు.

**బీసీల ద్రోహి చంద్రబాబు..**

రాయదుర్గం: బడుగు, బలహీన వర్గాల ద్రోహి టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు అని ఏపీఐఐసీ చైర్మన్, నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి అన్నారు. శుక్రవారం తన నివాసం లో రాష్ట్ర నాయీ బ్రహ్మణ వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ యల్లనూరు ప్రసాద్, తాలూకా అధ్యక్షుడు కణేకల్లు హనుమంతరావుతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. మెట్టు మాట్లాడుతూ చంద్రబాబు బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుని వదిలేశాడన్నారు. సీఎం జగన్ ఆ వర్గాలకు పెద్దపీత వేస్తూ వచ్చారన్నారు. సంక్షేమం నుంచి రాజ్యాధికారం వరకూ అన్నింటా సముచిత స్థానం కల్పించిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. నాయీబ్రహ్మణుల పట్ల చంద్రబాబు అవహేళనగా మాట్లాడితే జగన్ వారి గౌరవ, మర్యాదలు పెంచేలా కృషి చేశారన్నారు నాయీబ్రహ్మణులకు విద్యుత్, ఇతర అవసరాల కోసం ఏడాదికి రూ.10 వేలు, ఆలయ కమిటీల్లో చోటు, వివిధ కార్పొరేషన్లలో సమానహక్కులు కల్పించిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కిందన్నారు. కార్పొరేషన్ డైరెక్టర్ మాట్లాడుతూ నాయిబ్రహ్మణుల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్న సీఎం జగన్ వెంటే నడుస్తామన్నారు. 14 ఏళ్లు సీఎం గా ఉంటూ చంద్రబాబు నాయిబ్రహ్మణులకు ఏం మేలు చేశారో చెప్పాలని నిలదీశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రామలింగ, ఉపాధ్యాక్షులు అంజినేయులు, మల్లికార్జున, తిప్పేస్వామి, శ్రీనివాసులు, లక్ష్మినారాయణ, నాగరాజు పాల్గొన్నారు.

### మాయమాటలు చెప్పే చంద్రబాబును నమ్మొద్దు


ప్రచారం చేస్తున్న మెట్టు విశ్వనాథరెడ్డి

కణేకల్లు: మాయమాటలు చెప్పే చంద్రబాబును నమ్మొద్దని వైఎస్సార్‌సీపీ నాయకుడు మెట్టు విశ్వనాథరెడ్డి సూచించారు. మండలంలోని బిదరకుంతం, మీన్లహళ్లి, గరుడచేడు గ్రామంలో ఆయన ఇంటింటికీ వెళ్లి రాబోవు ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. అన్నీవర్గాల ప్రజలకు మేలు చేసే సీఎం వైస్ జగన్‌మోహన్‌రెడ్డిరి అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ డి.పద్మావతి, జెడ్పీ మాజీ సభ్యుడు పాటిల్ నాగిరెడ్డి, మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పట్టణ కన్వీనర్ టీ కేశవరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్పచౌదరి, మార్కెట్‌యార్డు మాజీ చైర్‌పర్సన్ ఉషారాణి, మాజీ వైస్ చైర్మన్ యంత్రకాయల వన్నూరప్ప, సర్పంచులు హనుమంతప్ప, జి.వన్నూరుస్వామి, ఫణీంద్ర, మండల జేసీఎస్ కన్వీనర్ హనుమంతరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, వైస్ సర్పంచు బసవరాజు, నాయకులు ప్రదీప్‌రెడ్డి, పాటిల్ బ్రహ్మానందరెడ్డి, కెనిగుంట రామిరెడ్డి, యర్రగుంట హనుమంతప్ప, ఆదినద్గురు చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### సజావుగా మండల సమావేశం


మాట్లాడుతున్న ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి

బ్రహ్మసముద్రం: మండల స్థాయి సర్వసభ్య సమావేశం ఎంపీపీ కంభం చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. మండంలోని పలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. జిల్లాలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఉపాధి పథకం ప్రారంభించి 19 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఎంపీడీఓ దాసానాయక్, ఎంపీపీతో ఉపాధి సిబ్బంది కేక్ కట్ చేయించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా జల జీవన్ మిషన్ పథకం కింద ఇంటింటికీ కొళాయి ఏర్పాటు చేస్తామన్నారు. భైరవానితిప్ప పంచాయతీలో శ్మశాన వాటిక కబ్జాకు గురైందని, అధికారుల దృష్టికి తీసుకువచ్చినా పట్టించుకోలేదని సర్పంచ్ శెట్టిగారి మంజునాథ సభ దృష్టికి తీసుకువచ్చారు. ఆర్ఐ నాగిరెడ్డి మాట్లాడుతూ పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సునందమ్మ, ఎంపీటీసీలు సువర్ణమ్మ, నాగలక్ష్మి, మారుతమ్మ, వరలక్ష్మి, నరసింహ, బూసప్ప, తిప్పేస్వామి, సర్పంచ్‌లు అంజినమ్మ, గోవిందప్ప, తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా చౌడేశ్వరీ జ్యోతుల ఉత్సవం



రాయదుర్గం: అలంకరణలో చౌడేశ్వరీ దేవి, ఉత్సవాల్లో పాల్గొన్న ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు


కళ్యాణదుర్గం మండలం మల్లిపల్లిలో చౌడేశ్వరీ అమ్మవారు

- ఆలయానికి పోటెత్తిన భక్త జనం
- ఆకట్టుకున్న కోలాటం, నృత్యాలు

రాయదుర్గం: పట్టణంలోని నేసేపేటలో ప్రసిద్ధి చెందిన చౌడేశ్వరిదేవి పంచమ జ్యోతుల మహోత్సవం శుక్రవారం కనుల పండువగా నిర్వహించారు. పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం లాంటి పూజా కార్యక్రమాలు చేపట్టాక, తొగట వీరక్షత్రియ కుల బాంధవులు పెద్దఎత్తున ఆలయానికి చేరుకుని అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం ఆకుపూజ, పూలు, నిమ్మకాయ హారాలతో అమ్మవారిని అందంగా అలంకరించారు. సాంప్రదాయబద్ధంగా వడి బియ్యం సమర్పించారు. ఖడ్గాలతో స్తుతించారు. అనంతరం పుర వీధుల్లో ఘనంగా ఊరేగించారు. భక్తులు జ్యోతులు నెత్తిన మోస్తూ నృత్యాలు చేశారు. ఆలయం వద్ద అన్నదానం, తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. మహిళలు వేల సంఖ్యలో హాజరై మొక్కుతీర్చారు. ఏపీఐఐసీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మెట్టుతో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, నాయకుడు పొరాళ్ల శివను సన్మానించారు. అలాగే ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వలీబాషా, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాదవరెడ్డి, పట్టణ కన్వీనర్ అరవ శివప్ప,ధర్మకర్త శ్రీరాములు, కమిటీ అధ్యక్షుడు కృష్ణమూర్తి, కార్యదర్శి హనుమంతు, తొగవీరక్షత్రియ సంఘం అధ్యక్షుడు ఎం.ప్రభాకర్, కార్యదర్శి వెంటరమణ బాబు, సభ్యులు, కౌన్సిలర్లు గౌని లావణ్య, పొరాళ్ల గోవిందరాజులు, కొంతెం దేవరాజు, తట్టే మంజు, శారద, లక్ష్మి, ఐనాపురం మంజు, శ్రీనివాసరెడ్డి, నాయకులు గౌని శ్రీరామిరెడ్డి, పాటిల్ వెంకటరెడ్డి భక్తులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని మల్లిపల్లిలో చౌడేశ్వరీ అమ్మవారి జాతర శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం భక్తులు జ్యోతులు, కలశాలతో అమ్మవారికి పూజలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

### 108లో సుఖ ప్రసవం

రాయదుర్గంటౌన్: పురిటి నొప్పులతో బాధపడుతున్న ఓ గర్భిణికి 108 అంబులెన్స్‌లో సుఖ ప్రసవం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. రాయదుర్గం మండలం జుంజురాంపల్లికి చెందిన గర్భిణి సుజాతకు గురువారం అర్ధరాత్రి పురిటి నొప్పులు మొదలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది సకాలంలో ఆ గ్రామానికి చేరుకుని కళ్యాణదుర్గం ఆర్డీటీ ఆస్పత్రికి బయల్దేరారు. మార్గమధ్యంలో గుండ్లపల్లి క్రాస్ వద్ద ఆమెకు నొప్పులు అధికం కావడంతో.. వాహనాన్ని రోడ్డు పక్కన ఆపి పైలెట్ మహేష్ సాయంతో ఈఎంటీ రామతులసి కాన్పు చేశారు. పండంటి ఆడబిడ్డకు సుజాత జన్మనిచ్చింది. అనంతరం తల్లీ బిడ్డను ఆర్డీటీ ఆస్పత్రికి చేర్చారు. ఈ సందర్భంగా 108 సిబ్బందికి సుజాత భర్త, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

### సీఐ శివరాముడు బాధ్యతల స్వీకరణ



కూడేరు: కూడేరు మండల పోలీసు స్టేషన్ అప్‌గ్రేడ్ అయింది. దీంతో సీఐగా శివ రాముడును ఉన్నతాధికారులు నియమించారు. శుక్రవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈయన అనంతపురం టూ టౌన్ పోలీసు స్టేషన్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

**ఎస్ఐగా గురుప్రసాద్‌రెడ్డి**



రాయదుర్గం(డి హీరేహాళ్): డి హీరేహాళ్ మండల ఎస్ఐగా శుక్రవారం గురుప్రసాద్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి దాకా ఇక్కడ విధుల్లో ఉండే రంగడు యాదవ్‌ను స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. బాధ్యతల అనంతరం ఎస్ఐని సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు సత్కరించారు.

### తహసీల్దార్ బదిలీ

గుమ్మఘట్ట: తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న బ్రహ్మయ్య అన్నమయ్య జిల్లాకు బదిలీ అయ్యారు. ఇన్‌చార్జ్ బాధ్యతలను డిప్యూటీ తహసీల్దార్ రఘుకు అప్పగించినట్లు అధికారులు తెలిపారు.

**సన్మానం**

కణేకల్లు: తహసీల్దార్ రజాక్‌వలి కర్నూలు జిల్లాకు బదిలీ కావడంతో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రజాక్‌వలీని శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, డిప్యూటీ తహసీల్దార్ రఘురామిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ గోవిందరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: తహశీల్దార్ శ్రీనివాసులు అన్నమయ్య జిల్లాకి బదిలీ కావడంతో శుక్రవారం స్థానిక రెవెన్యూ సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. శాలువా కప్పి, పూలమాలలతో సత్కరించారు.

### విద్యుత్‌షాక్‌తో పాడి ఆవు మృతి

రాయదుర్గం(డి హీరేహాళ్): డి హీరేహాళ్ మండలంలోని హెచ్ఎస్ తండాలో రైతు మంగిబాయికు చెందిన పాడి ఆవు శుక్రవారంవిద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందింది. దీంతో సుమారు రూ.40 వేలు నష్టపోయానని బాధితురాలు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు ఆదుకోవాలని ఆమె కోరారు.

# ఎంపీడీఓల బాధ్యతల స్వీకరణ





నరసింహమూర్తి (శెట్టూరు), సుబ్బరాజు (బెళుగుప్ప), గౌరీదేవి (గుమ్మఘట్ట), కొండయ్య(విడపనకల్లు)

శెట్టూరు: ఎంపీడీఓగా కె నరసింహమూర్తి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గత సంవత్సర కాలంగా ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పాలన కొనసాగగా, బదిలల్లో భాగంగా కర్నూలు జిల్లా మద్దికేర మండలం నుంచి ఆయన శెట్టూరుకు బదిలీపై వచ్చారు. ఎంపీడీఓకు ఈఓఆర్డీ రఘురామారావు, ఎంఈఓ శ్రీధర్, కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

బెళుగుప్ప: ఎంపీడీగా జీవి సుబ్బరాజు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ రామచంద్ర వైఎస్సార్ జిల్లాకు బదిలీ అయ్యారు. కర్నూలు జిల్లా మంత్రాలయం నియోజకవర్గంలోని కౌతాలం మండల ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న జీవి సుబ్బరాజు బెళుగుప్పకు బదిలీపై వచ్చారు. ఆయనకు ఈఓఆర్డీ మాధవరెడ్డి, ఏఓ దామోదర్, సర్పంచులు, పంచాయతీ సెక్రటరీలు శుభాకాంక్షలు తెలిపారు.

గుమ్మఘట్ట: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎం. గౌరీదేవి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కర్నూలు జిల్లా నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఎంపీడీఓ నరసింహమూర్తి చిత్తూరు జిల్లాకు బదిలీ అయిన విషయం విదితమే.

విడపనకల్లు: ఎంపీడీఓగా సీవీ కొండయ్య శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ ఎంపీడీఓగా పని చేస్తున్న శ్రీనివాసులు ప్యాపిలికి బదిలీ అయ్యారు. కొండయ్య కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం నుంచి విడపనకల్లుకు బదిలీపై వచ్చారు.

# ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టండి


మంత్రి పెద్దిరెడ్డి వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పీ శిల్ప

రాయదుర్గం: మున్సిపల్ కార్యాలయంలో ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప విజ్ఞప్తిచేశారు. శుక్రవారం మడకశిర పర్యటనకు వచ్చిన మంత్రిని పలువురు కౌన్సిలర్లు, పార్టీ నాయకులతో వెళ్లి ఆమె కలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలు పరిష్కారం కోరుతూ మంత్రికి వినతి పత్రం అందజేశారు. వేసవి సమీపిస్తున్న దృష్ట్యా తాగునీటి కోసం అదనపు నిధులు కేటాయించాలని విజ్ఞప్తిచేశారు. అలాగే పట్టణంలో నగరవనం అభివృద్ధికి కృషిచేయాలన్నారు. పట్టణంలోని ముంపుకాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థకు శాశ్వత పరిష్కార మార్గం చూపేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.20 కోట్ల నిధులు కేటాయించారని, వాటిని సకాలంలో అందించాలన్నారు. వాటికి మంత్రి సానుకూలత వ్యక్తం చేశారన్నారు. మంత్రిని కలిసిన వారిలో వార్డు ఇన్‌చార్జులు పొరాళ్ల శిల్ప, గౌని శ్రీరామిరెడ్డి, కౌన్సిలర్లు ఉన్నారు.

# చెట్లు నరికి.. అక్రమంగా విక్రయించారు!


నరికి వేసిన చెట్ల మొద్దులను చూపుతున్న గ్రామస్తులు

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని వైద్యులు ప్రభుత్వ ఆశయాలకు తూట్లు పొడిచి చెట్లను నరికి విక్రయించిన సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. బొమ్మనహాళ్ ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రి ఆవరణలో ఉన్న చింతచెట్లు, వేప చెట్లను వైద్యాధికారిణి శ్రీలక్ష్మి, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో నరికివేశారు. ఆస్పత్రి ఆవరణలో చెట్లు అడ్డంగా ఉన్నాయని, గ్రామంలోని పిల్లలు వచ్చి చెట్ల కింద అల్లరి చేస్తున్నారని సాకులు చెప్పి చెట్లను నరికి చేశారు. రెండు చింతచెట్లు, రెండు వేపచెట్లను వైద్యాధికారిణి నరికి వేయించడంతో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పయ్యావుల సత్యన్న, వైస్ ఎంపీపీ రమేష్, నాయకులు ఫోటో బసవరాజు, జయరామ్‌రెడ్డి, నాగరాజు, సురేష్, మారుతి తదితరులు మండిపడుతున్నారు. ప్రభుత్వ అధికారులు మొక్కలను పెంచడం చూశాం.. కానీ పెద్ద చెట్లు నరకడం ఇక్కడే చూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. చెట్లు నరికి వేయించిన వైద్యాధికారిణి, వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు, ఎస్ఐకి వినతిపత్రం అందజేశామన్నారు. ఈ విషయమై వివరణ కోరేందుకు వైద్యాధికారిణికి సాక్షి ఫోన్ చేయగా ఆమె స్పందించలేదు.

# పేదలకు వరం 'జగనన్న ఆరోగ్య సురక్ష'

బెళుగుప్ప: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' పేదలకు వరమని వైస్ ఎంపీపీ పుష్పావతి అన్నారు. శుక్రవారం మండలంలోని తగ్గుపర్తి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు చంద్రానాయక్, కార్తీక్ రెడ్డి, ప్రియాంక, రుషికేష్, ఈఓఆర్డీ మాధవరెడ్డి, ఏఓ దామోదర్, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరమణ, పంచాయితీ కార్యదర్శులు వర్ల శంకర్, మమత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విడపనకల్లు: మండలంలోని పాల్తూరు గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ కరణం పుష్పావతి, సర్పంచు బీబ్లారాణి, ఎంపీడీఓ కొండయ్య, ఈఓఆర్డీ సత్యబాబు పంచాయితీ కార్యదర్శి రామకృష్ణ, వైద్యులు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**మెగా డీఎస్సీ ప్రకటించడం హర్షణీయం**

కళ్యాణదుర్గం: ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీని ప్రకటించడం హర్షణీయమని వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్షావలి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఏపీలో 6,100 ఉపాధ్యాయ పోస్టులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం సంతోషదాయకమన్నారు. నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపేలా సీఎం జగన్ నిర్ణయం తీసుకోవడం చారిత్రాత్మకమన్నారు. ఇలాంటి సీఎం మరో 20 ఏళ్లు సుపరిపాలన చేయాలన్నారు.

**వైభవంగా కుంభాల ఊరేగింపు**

వజ్రకరూరు: మండలంలోని కమలపాడులో శుక్రవారం కుంభాల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. గ్రామదేవత సుంకులమ్మ అవ్వ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలు పంపిణీ చేశారు. గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

**మెనూ ప్రకారం భోజన వసతి కల్పించండి**

విడపనకల్లు: మెనూ ప్రకారం విద్యార్థులకు భోజన వసతి కల్పించాలని ఎంపీపీ కరణం పుష్పావతి సూచించారు. శుక్రవారం మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల హాస్టల్‌ను ఎంపీపీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనం నాణ్యతగా లేకపోవడంతో సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పదో తరగతి, ఇంటర్‌లో వంద శాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలని ఎస్‌ఓ తులసిప్రియ, అధ్యాపకులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్సీసెల్ జిల్లా కార్యదర్శి సుంకన్న, పేరెంట్స్ కమిటీ చైర్మన్ గిరిబాబు, మేకల రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

**ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు**

కూడేరు: ఆరోగ్య సమస్యలు తలెత్తినపుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని సీహెచ్ఓ మాధవి సూచించారు.శుక్రవారం మండలంలోని కరుట్లపల్లిలోని హైస్కూల్‌లో వైద్యాధికారులు ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రతలు, కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉన్నపుడే చదువుపై శ్రద్ధ చూపగలరన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఆంజనేయులు, పీడీ నరసింహులు, ఉపాధ్యాయులు , ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

**టెట్రా ప్యాకెట్ల స్వాధీనం**

గుమ్మఘట్ట: మండలంలోని తాళ్లకెర గ్రామంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న చాంద్‌బాషా నుంచి 12 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. అతడిపై కేసు నమోదు చేసి, అరెస్టు చేశామన్నారు.

**24 గంటల్లోనే రైతులకు చెల్లింపులు**

వజ్రకరూరు: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రంలో రైతులకు 24 గంటల్లోనే చెల్లింపులు చేస్తామని ఏఓ మధుకర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని రాగులపాడు రైతు భరోసా కేంద్రంలో అగ్రి అడ్వైజరీ బోర్డు సమావేశం ఏర్పాటు చేశారు. ఏఓ మాట్లాడుతూ రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఉరవకొండలో కందుల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసిందన్నారు. క్వింటా ధర రూ.9,445గా నిర్ణయించిదన్నారు. పంటల సాగులో రైతులు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎంపీఓ మోహన్, రైతులు పాల్గొన్నారు.

**తాగునీటి సమస్యకు పరిష్కారం**

కంబదూరు: మండల కేంద్రంలోని కోట కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను సర్పంచ్ పద్మావతమ్మ పరిష్కరించారు. కొద్ది రోజులుగా కాలనీలోకి తాగునీరు సరఫరా కాకపోవడంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడేవారు. సమస్యను సర్పంచ్‌తోపాటు వైఎస్సార్‌సీపీ సచివాలయ మండల కన్వీనర్ సాకే గంగాధర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే వారు స్పందించి శుక్రవారం కాలనీకి నూతనంగా పైపులైన్ ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించారు. దీంతో కాలనీవాసులు సర్పంచ్,సచివాలయ కన్వీనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

**విద్యార్థినులకు అభినందనల వెల్లువ**

కణేకల్లు: 'ఆడుదాం ఆంధ్రా'లో క్రికెట్ పోటీల్లో జిల్లాస్థాయి రన్నర్స్‌గా నిలిచిన మోడల్‌స్కూల్ విద్యార్థినులకు అభినందనలు వెల్లువెత్తాయి. స్థానిక మోడల్ స్కూల్‌లో శుక్రవారం అభినందన సభ నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ ఆదినారాయణ, వైస్ ప్రిన్సిపాల్ రెహనబేగం, పీడీ రమేష్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు